
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం। 23। ఆగస్టు। 2023



సోమశిలలో నీటినిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 19.544 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 620 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా) -	రూ.60,400
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)-	రూ.5,424
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,587
నవర (8 గ్రా)	- రూ.44,696

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.5 /28.5

మంగళవారం గాలిలో తేమ 62 శాతం ఉంది. బుధవారం ఎండతీవ్రత, ఉక్కపోత ఎక్కువగా ఉంటాయని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

ప్రతి మొక్క బతకాలి



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకట్రావ్

నెల్లూరు(పొగతోట): ప్లాంటేషన్ ప్రక్రియలో భాగంగా నాటిన ప్రతి మొక్క బతికేలా చర్యలు చేపట్టాలని డ్వామా పీడీ వెంకట్రావ్ మండల అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. జగనన్న లేఅవుట్లకు సంబంధించిన సోంపిట్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఏపీడీలు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటించిన పనుల నిర్వహణలో సమస్యలు ఉంటే పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఏజీపీ నియామకం



కాకాణి జ్యోతి

నెల్లూరు(లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యురాలు, న్యాయవాది కాకాణి జ్యోతిని అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె నెల్లూరు మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రభుత్వం తరఫున సివిల్ కేసులు వాదించనున్నారు. ఈ పదవిలో మూడేళ్లు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి రోజారెడ్డి, పలువురు న్యాయవాదులు ఆమెకు అభినందనలు తెలిపారు.

సకాలంలో రుణాలు మంజూరు చేయండి

- ఏపీజీబీ చైర్మన్ రాకేష్‌కాశ్యప్



మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్‌కాశ్యప్

నెల్లూరు(పొగతోట): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సకాలంలో రుణాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ) చైర్మన్ రాకేష్‌కాశ్యప్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో బ్యాంక్ మేనేజర్లతో నిర్వహించిన సమావేశంలో చైర్మన్ మాట్లాడారు. పంట రుణాలు, విద్య, హౌసింగ్ రుణాలు వేగవంతంగా అందించాలన్నారు. బ్యాంకుల వారీగా నిర్దేశించిన రుణ లక్ష్యాలను వంద శాతం సాధించాలని సూచించారు. డిపాజిట్ల సేకరణ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజల అవసరాలకు రుణాలు మంజూరు చేయాలని, రికవరీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. చిన్న తరహా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారిని ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో ఏపీజీబీ జనరల్ మేనేజర్ ఫడ్గొట్వార్, రీజినల్ మేనేజర్ మోహన్‌రెడ్డి, చీఫ్ మేనేజర్ ఆంజనేయులు, బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేదపారాయణ సప్తాహం



వేదపారాయణం చేస్తున్న పండితులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పొగతోట గాంధీనగర్‌లో ఉన్న శ్రీఆదిశంకర ధ్యానమందిరంలో ఇరగవరం వేదపండిత పరిషత్ ఆధ్వర్యంలో చక్రాలవారి ట్రస్ట్ పర్యవేక్షణలో వేదపారాయణ సప్తాహం మంగళవారం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. శ్రీశృంగేరి పీఠ ఉత్తరాధిపతి జగద్గురు విదుశేఖర భారతీస్వామి వారి జన్మదిన వేడుకల్లో భాగంగా క్రమాంత ఘనపాటి వేదపండితులు 18 మందిని, జట ఘనాపాటి వేదపండితులు 8 మందిని, అధర్వణ వేదపండితులు బ్రహ్మశ్రీ ఎల్లాప్రగడ హేమదుర్గాపవన్‌కుమార్‌శర్మ, జంగా శివకుమార్‌శర్మలను ట్రస్ట్, మందిర కమిటీ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా పామర్తి యదువంశిక భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమ నిర్వాహకులు బ్రహ్మశ్రీ గుళ్లపల్లి శివశర్మ అవధాని, చక్రాల వేంకటలక్ష్మీనరసింహం మాట్లాడుతూ నెల్లూరులో తొలిసారిగా జరుగుతున్న వేదపారాయణ సప్తాహంలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

అమ్మకు అండగా..

జిల్లాలో..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు - 52	అర్బన్ హెచ్‌సీలు - 28
	సామాజిక ఆరోగ్య కేంద్రాలు - 10
	ఏరియా వైద్యశాలలు - 2



ఈమె పేరు తుపాకుల రవళి. ఊరు కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం గిరిజనకాలనీ. ఇటీవల రవళి కాన్పు కోసం కోవూరులోని ప్రభుత్వ వైద్యశాలకు వచ్చారు. గర్భిణి కావడంతో పౌష్టికాహారం సక్రమంగా, సరైన సమయానికి తీసుకోక రక్తహీనత ఏర్పడింది. తనకు రక్తం అవసరమైంది. ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు రక్తం వృద్ధి చెందేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు.





ఈమె పేరు చడమాల శ్రావణి. నెల్లూరు 3వ మైలు ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఇటీవల శ్రావణి కాన్పు కోసం కోవూరులోని ప్రభుత్వ వైద్యశాలకు వచ్చారు. ఆమెకు ప్రస్తుతం రక్తం 7 శాతం ఉండడంతో కాన్పు సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా రక్తం వృద్ధి చెందేలా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

ప్రసూతి మరణాల నివారణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. రక్తహీనత వల్లే ఈ మరణాలు సంభవిస్తాయని గుర్తించి వాటి నివారణపై దృష్టి సారించింది. బాలింతల్లో ఎఫ్‌సీఎం (ఫెర్రిక్ కార్బాక్సీ మాల్టోజ్) ఇంజక్షన్ ద్వారా రక్తహీనతను నివారించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది.

జిల్లాలో రూ.51.60 లక్షల విలువైన ఎఫ్‌సీఎం ఇంజక్షన్లు

- ప్రసూతి మరణాల నివారణపై ప్రత్యేక దృష్టి
- ఒక్కో ఇంజక్షన్ ఖరీదు రూ.2 వేలు పైనే
- ఉచితంగా అందజేస్తున్న ప్రభుత్వం

కోవూరు: ప్రసూతి మరణాలకు గర్భిణుల్లో రక్తహీనతే ప్రధాన కారణమని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో కాన్పు సమయంలో మాతా శిశు మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే మరణాలను పూర్తిస్థాయిలో తగ్గించేందుకు వైద్యఆరోగ్యశాఖ ఎనలేని కృషి చేస్తోంది. ఇప్పటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం కిట్లను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తూ వారిలో రక్తం వృద్ధి చెంది సంపూర్ణ ఆరోగ్యవంతులయ్యేలా చర్యలు చేపడుతోంది. అలాగే రక్తహీనత వల్ల కలిగే ఇబ్బందులపై మహిళలకు అవగాహన కల్పిస్తూ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సదస్సులు నిర్వహిస్తున్నారు.



ఎఫ్‌సీఎం ఇంజక్షన్

ప్రసూతి మరణాల నివారణే ధ్యేయంగా..

జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 22,400 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారని సమాచారం. వీరిలో 1,600 మంది గర్భిణులకు ప్రసవ సమయంలో రక్తహీనత ఉందని గుర్తించారు. అలాగే రక్తహీనత వల్ల అనేక మంది మహిళలు ప్రసవానంతరం మృతిచెందుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. దీని నివారణకు ఇప్పటి వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు, సుక్రోజ్ ఇంజక్షన్లు మాత్రమే వినియోగించేవారు. అయితే ఢిల్లీలోని ఎయిమ్స్ (ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో ఉన్న నేషనల్ ఎనిమియా కంట్రోల్ రీసెర్చ్ విభాగం మార్గదర్శకాల మేరకు రక్తహీనతను త్వరితగతిన నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఎం (ఫెర్రిక్ కార్బాక్సీ మాల్టోజ్) ఇంజక్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. దీని ధర రూ.2 వేలకు పైగా ఉన్నప్పటికీ ప్రసూతి మరణాల నివారణే ధ్యేయంగా ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవానంతరం ముందు జాగ్రత్త చర్యగా బాలింతలకు ఈ ఇంజక్షన్ ఇచ్చి డిశ్చార్జి చేయనున్నారు. జిల్లాకు 2,580 ఎఫ్‌సీఎం ఇంజక్షన్లు మంజూరు కాగా, వాటిని అవసరమైన అన్ని ప్రాంతాలకు పంపిణీ చేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

రక్తహీనత ఉన్న వారిని గుర్తించి..

ఆస్పత్రిలో బిడ్డకు జన్మనిచ్చిన తల్లిని డిశ్చార్జి చేసే ముందు హిమోగ్లోబిన్ పరీక్ష నిర్వహిస్తారు. అందులో మధ్యస్థ, తీవ్రస్థాయిలో రక్తహీనత ఉన్న వారిని గుర్తించి సత్వరమే ఎఫ్‌సీఎం ఇంజక్షన్ చేస్తారు. తిరిగి మూడు వారాల తరువాత హెచ్‌బీ పరీక్షలు చేసి అవసరాన్ని బట్టి ఈ ఇంజక్షన్ చేస్తారు. బాలింతల్లో రక్తహీనత నివారించే వరకు వైద్యులు పర్యవేక్షిస్తారు. అలాగే చిన్నారులకు క్రమం తప్పకుండా నిర్ణీత సమయంలో టీకాలు వేయించుకొనేలా తల్లులకు అవగాహన కల్పిస్తారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో పరిశీలన అనంతరం బాలింతలపై ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని నిర్ధారించుకున్న తరువాతే రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్‌సీఎం ఇంజక్షన్లు అందుబాటులోకి తీసుకువచ్చిందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

రక్తహీనతకు విముక్తి



మహిళల ఆరోగ్య రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చును లెక్కచేయకుండా ఎఫ్‌సీఎం ఇంజక్షన్లు సరఫరా చేసింది. ఇప్పటికే అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎఫ్‌సీఎంలు అందుబాటులో ఉంచాం. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ ఇంజక్షన్లు బాలింతల్లో రక్తహీనత నివారణకు ఎంతో దోహదపడతాయి.

– డాక్టర్ పెంచలయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

నేడు టంగుటూరి జయంతి వేడుకలు నిర్వహించండి

నెల్లూరు(దర్గామిట్ట): స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను బుధవారం అన్నిచోట్ల నిర్వహించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా, మండల, గ్రామస్థాయిల్లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు.

సమయపాలన పాటించాలి

- డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి



ఉద్యోగులతో మాట్లాడుతున్న పీడీ

కొడవలూరు: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని డీఆర్‌డీఏ పీడీ కె.సాంబశివారెడ్డి సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెం 1, 2, కమ్మపాళెం, రేగడిచెలిక సచివాలయాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. రేగడిచెలికలో ఉద్యోగుల హాజరు తక్కువగా ఉండడంపై మండిపడ్డారు. గ్రామ స్థాయిలో పరిపాలనకు అద్దం పట్టే సచివాలయాల్లో ప్రతి ఉద్యోగి అందుబాటులో ఉండాలన్నారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించాలన్నారు. అర్హత ఉండి అందలేదన్న ఫిర్యాదుల్లేకుండా చూడాల్సిన బాధ్యత ఉద్యోగులదేనన్నారు. పీడీ వెంట పంచాయతీ కార్యదర్శి జి.జాలయ్య, వీఆర్వో వెంకయ్య ఉన్నారు.

సత్వర వైద్యసేవలు అందించాలి



జీజీహెచ్‌లో వార్డును పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(బారకాసు): ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)కి వస్తున్న రోగులకు సత్వర వైద్యసేవలు అందించాలని, అందుకు ఆస్పత్రిలోని వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం నగరంలోని జీజీహెచ్‌ని సందర్శించిన కలెక్టర్ ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యులతో సమావేశమయ్యారు. ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, ల్యాబ్‌లు, ఆపరేషన్ థియేటర్లు, బ్లడ్‌బ్యాంక్ పనితీరుకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీజీహెచ్‌లోని అన్ని విభాగాల్లో వైద్యసేవలను మెరుగుపరచాలని ఆదేశించారు. అలసత్వం వహించిన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా మాతా శిశు సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జీజీహెచ్‌లో నిర్వహిస్తున్న రక్తనిధి కేంద్రాన్ని పటిష్టంగా నిర్వహించడంతోపాటు రోగులకు అవసరమైన రక్తాన్ని సకాలంలో అందేలా ప్రణాళికాబద్ధంగా ముందుకువెళ్లాలని సూచించారు. చిన్నపిల్లల వార్డులో వైద్యసేవలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, వైద్యసేవలు మెరుగుపరచాలని సంబంధిత వైద్యులను ఆదేశించారు. ఓ.టీ. బ్లాక్‌ను ఒక నెలలోపు వినియోగంలోకి తీసుకురావాలని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. సెంట్రల్ డయాగ్నోసిస్ బ్లాక్‌కు అవసరమైన సివిల్ వర్క్‌లు, ఏసీల ఏర్పాటు, విద్యుదీకరణ తదితర పనులు పూర్తి చేసి నెల రోజుల లోపు జీజీహెచ్‌లోని అన్ని విభాగాల వైద్యపరీక్షలు ఆ బ్లాక్‌లో నిర్వహించాల్సిన బాధ్యత ఆస్పత్రి సూపరింటెండెంట్, ఏపీఎంఐడీసీ డీఈ, సంబంధిత విభాగాల హెచ్‌ఓడీలపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జమున, ఏపీఎంఎస్ఐడీసీ డీఈ ఉమాశంకర్, జీజీహెచ్ అభివృద్ధి సొసైటీ కమిటీ కోఆర్డినేటర్ లక్ష్మీసునంద, హెచ్‌ఓడీలు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గృహప్రవేశాలకు సిద్ధం చేయండి

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని వెంకటేశ్వరపురం జగనన్న కాలనీలో 600 ఇళ్లను గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం నెల్లూరు నగర సమీపంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న జగనన్న లేఅవుట్‌ను మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, హౌసింగ్ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు లోపు 600 ఇళ్లను గృహప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. లేఅవుట్‌లోని అన్ని ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు, నీటివసతి కల్పించేందుకు చర్యలు చేపట్టాలని, కాలనీ ముఖద్వారం వద్ద ఆర్చి నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. పనుల్లో ఎక్కడా జాప్యం లేకుండా సత్వరం పూర్తయ్యేలా అవసరమైన చర్యలు వేగంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ నాగరాజు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ సంపత్‌కుమార్, విద్యుత్‌శాఖ ఈఈ సోమశేఖర్, హౌసింగ్ డీఈ దయాకర్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువతి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ప్రేమ విఫలమై మనస్తాపం చెందిన ఓ యువతి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నగరంలోని శోధన్‌నగర్ సమీపంలో ఉన్న రామిరెడ్డి బ్రిడ్జి రైలుపట్టాలపై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు గాయత్రినగర్‌కు చెందిన హిమబిందు(28) బీటెక్ చదవి ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. వర్క్‌ఫ్రమ్ హోమ్ చేస్తోంది. రామలింగాపురానికి చెందిన మోహన్‌మౌలిత్ ఆమె ప్రేమించుకున్నారు. కులం వేరు కావడంతో మోహన్ మౌలిత్ కుటుంబసభ్యులు వారి ప్రేమను అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున ఆమె ఇంట్లో నుంచి కారులో బయటకు వచ్చింది. అనంతరం రామిరెడ్డి బ్రిడ్జి వద్ద చెన్నైవైపు వెళ్లే రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనా స్థలం సమీపంలో ఉన్న కారును స్వాధీనం చేసుకున్నారు. మృతురాలి తల్లిదండ్రులు ఉదయం నిద్ర లేచి ఆమె కోసం గాలించారు. జాడ తెలియకపోవడంతో దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టిన క్రమంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుందని తెలియడంతో బాధిత తల్లిదండ్రులు రైల్వే పోలీసులను సంప్రదించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించిన ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒక యూనిట్లోనే విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో ఒక యూనిట్లో మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఓవర్ ఆయిలింగ్ కారణాల వల్ల 3వ యూనిట్లో ఉత్పత్తి నిలిపివేశారు. సాంకేతిక కారణాల వల్ల 2వ యూనిట్లో కూడా విద్యుదుత్పత్తి నిలిపివేశారు. అయితే, సమస్యను పరిష్కరించి మంగళవారం రాత్రి ఈ యూనిట్ నుంచి ఉత్పత్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక 1వ యూనిట్లో 495 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

చంద్రబాబు పాలనంతా అవినీతిమయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 'చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టారు. ఆయన సీఎంగా పనిచేసిన కాలమంతా అవినీతి మయం.' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలి రూరల్ మండలం గౌరవరంలో మంగళవారం రామిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు నివ్వెరపోయేలా పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చినట్లు చెప్పారు. తన హయాంలో ఏం చేశారో ఒక్కటి కూడా చెప్పలేని స్థితిలో చంద్రబాబు ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రజలు బ్రిటిష్ వాళ్లు తయారు చేసిన సర్వే రికార్డులపైనే ఆధారపడి ఉన్నారంటే, విజనరీ అని చెప్పుకొనే బాబుకు సిగ్గనిపించడం లేదా? అని ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వం వచ్చాక సమగ్ర భూ సర్వేను అత్యాధునిక సాంకేతికతతో చేపట్టిందన్నారు. రికార్డులు స్పష్టంగా ఉండే విధంగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలకు మంచి జరగడాన్ని ఓర్వలేక చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని తెలిపారు. వారి మాటలను ప్రజలు తిప్పికొట్టాలని, మేలు చేసే జగనన్న ప్రభుత్వానికే అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవరపల్లి రాధిక, జెడ్పీటీసీ జంపాని రాఘవులు, నాయకులు కున్నం వెంకట్రామిరెడ్డి, చింతం బాబుల్‌రెడ్డి, పలకా శ్రీధర్‌రెడ్డి, సురే శ్రీనివాసులురెడ్డి, సురే జయశ్రీ, దేవరపల్లి మహేంద్ర, నాగనగారి శ్రీనివాసులు, జిల్లా కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ చింతం తిరుములరాణి తదితరులు పాల్గొన్నారు.



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

విద్యార్థుల కోసం అనేక పథకాల అమలు

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 16వ వార్డులో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నాలుగు సంవత్సరాల్లో నాడు – నేడు కింద రెండు దఫాలుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాలు కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలకు కొమ్ముకాసి ప్రభుత్వ బడులను గాలికొదిలేశాయని విమర్శించారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం గణనీయంగా తగ్గిందన్నారు. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్‌ను మించి అభివృద్ధి చేయడంతోపాటు ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టారన్నారు. దీనిని వ్యతిరేకించిన ప్రతిపక్షాలు ఇప్పుడు విద్యార్థుల ప్రతిభను చూసి ఆశ్చర్యపోతున్నాయని చెప్పారు. అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద వంటి పథకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 80 సచివాలయాల పరిధిలో సుమారు 95,896 ఇళ్లను సందర్శించామన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి, వైస్ చైర్మన్ షాహుల్, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, కౌన్సిలర్లు బిట్రగుంట ప్రమీలమ్మ, పుట్టా లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ఎంతో మేలు



బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: 'పాలనను ప్రజల ముంగిటకు చేర్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రారంభించారు. వాటి ద్వారా అన్ని వర్గాలకు ఎనలేని సేవలందుతున్నాయి.' అని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఎంపీకి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరించారు. బుక్‌లెట్లు పంపిణీ చేశారు. సమస్యలు తెలుసుకున్నారు. తమకు పథకాలు అందుతున్నాయని ప్రజలు సంతోషంగా చెప్పారు. అనంతరం ఆదాల మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు అందిస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గంలో తనను గెలిపించాలని కోరారు. మళ్లీ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. అభివృద్ధి విషయంలో టీడీపీ నాయకుల మాటల్లో నిజం లేదన్నారు. ఎనలేని విధంగా రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందన్నారు. తెలుగుదేశం ప్రచారాన్ని ప్రజలు పట్టించుకోవడంలేదన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. మరింత బాగా ప్రజలకు సేవలదించాలని సూచించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, స్థానిక నాయకులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐటీఐలో మూడో విడత ప్రవేశాలు

నెల్లూరు(టౌన్): 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఆయా కోర్సుల్లో చేరేందుకు మూడో విడత ప్రవేశాలకు ఈనెల 27వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ బాలికల ఐటీఐ ప్రిన్సిపల్ ఎస్‌కే రజియా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈనెల 28వ తేదీలోపు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ అధికారులను సంప్రదించాలన్నారు. ఈనెల 30న నెల్లూరు వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలికల ఐటీఐలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలియజేశారు.

ఆర్థిక సమస్యలతో యువకుడి ఆత్మహత్య



భార్గవ్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): భార్యకు సీమంతం చేసేందుకు డబ్బులు లేకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు వెంకటేశ్వరపురంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. జనార్దనరెడ్డికాలనీలో ఎల్.భార్గవ్ (23), ప్రేమ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి సుమారు ఏడాదిన్నర క్రితం వివాహమైంది. భార్గవ్ రైల్వే పార్శిల్ ఆఫీసుతోపాటు గోదాముల్లో పనులు చేసుకుంటూ భార్యను పోషించుకోసాగాడు. ప్రేమ ప్రస్తుతం ఎనిమిది నెలల గర్భిణి. ఆమెకు సీమంతం చేసేందుకు ఆర్థిక ఇబ్బందులు వెంటాడాయి. డబ్బు కోసం ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో భార్గవ్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం వెంకటేశ్వరపురంలోని తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లాడు. కుటుంబసభ్యులు బయట ఉండగా ఇంట్లోకి వెళ్లి చీరతో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని కిందకు దించి చికిత్స నిమిత్తం రామచంద్రారెడ్డి హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే భార్గవ్ మృతిచెందాడని నిర్ధారించారు. భర్త మృతదేహాన్ని చూసి ప్రేమ గుండెలవిసేలా రోదించింది. ఆమె నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 130
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 226
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 250
లేయర్ చికెన్	: 178



అశ్వవాహనంపై వెంకయ్యస్వామి ఊరేగింపు

వెంకటాచలం: మండలంలోని గొలగమూడిలో భగవాన్ వెంకయ్య స్వామి 41వ ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం అశ్వవాహన సేవ నిర్వహించారు. ఉదయం ఆలయంలో నిత్య పూజల అనంతరం స్వామికి అశ్వవాహనంపై ప్రత్యేక పూలాలంకరణ చేశారు. భక్తులు భుజాలపై స్వామిని ఆలయం చుట్టూ తిప్పారు. తర్వాత ట్రాక్టర్‌పై గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ సాగింది. ఉత్సవం ముందు మహిళల కోలాట ప్రదర్శనలు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సేవకు నెల్లూరుకు చెందిన శ్రీధర్ – అరుణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.



అశ్వవాహనంపై వెంకయ్యస్వామి

• ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి పెద శేషవాహనసేవను నిర్వహించారు. ఈ గ్రామోత్సవం గొలగమూడి వీధుల్లో వేడుకగా సాగింది. ఉత్సవం వెంట భక్తులు వేలాది సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సేవకు ముత్తుకూరుకు చెందిన ఈదూరు రామ్మోహన్ రెడ్డి – సుప్రియ దంపతులు, ఈదూరు రామ్ ప్రదీప్‌రెడ్డి – లక్ష్మీశర్వాణి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉత్సవాలను ఆశ్రమ కార్యనిర్వాహణాధికారి పి.బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

ఉత్సవాల్లో నేడు

బుధవారం ఉదయం సింహ వాహనసేవ, రాత్రి గరుడ వాహనసేవను నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

ప్రతి పల్లెలో అభివృద్ధి పరుగులు



లబ్ధిదారుకి బుక్‌లెట్ అందజేస్తున్న రాజారెడ్డి

• ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి

వింజమూరు(ఉదయగిరి): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి పల్లెలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఆ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి అన్నారు. వింజమూరు పట్టణంలోని సచివాలయం–1 పరిధిలో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధి, టీడీపీ హయాంలో, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యత్యాసాలను వివరించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిపై త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మెరుగైన పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే సాధ్యపడుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ వివిధ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం పాలన చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చేసిన మంచిని గుర్తించి వైఎస్సార్‌సీపీకి మద్దతు పలకాలని కోరారు. సచివాలయం–1 పరిధిలో రెండోరోజు 300 కుటుంబాలకు వెళ్లి పథకాల బుక్‌లెట్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాలకృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మలిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, స్థానిక నాయకులు పల్లాల కొండారెడ్డి, మద్దూరు బాబు, మద్దూరు బాలకృష్ణ, గోపిరెడ్డి రమణారెడ్డి, సొసైటీ డైరెక్టర్ పోలుబోయిన వెంకటేశ్వర్లు, కాలేషా, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలం వివాదంలో పలువురిపై హత్యాయత్నం కేసు

• నిందితులంతా టీడీపీ సానుభూతిపరులు

పొదలకూరు: మండలంలోని నావూరుపల్లి గ్రామంలో పొలం వివాదానికి సంబంధించి మంగళవారం పలువురిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసులో నిందితులంతా టీడీపీ సానుభూతిపరులు. ఎస్సై ఎస్‌కే కరిముల్లా కథనం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీపతి అనే పారిశ్రామికవేత్తకు నావూరుపల్లికు చెందిన తలచీరు రాఘవేంద్ర గతంలో నగదు బాకీ ఉన్నాడు. రాఘవేంద్ర నగదు చెల్లించకపోవడంతో లక్ష్మీపతి నావూరుపల్లిలో అతడికి చెందిన సుమారు 30 ఎకరాల పొలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఇటీవల పలుమార్లు లక్ష్మీపతి పొలంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించాడు. దీంతో రాఘవేంద్ర తన అనుచరులతో కలిసి అడ్డుకుని గొడవపడేవాడు. అంతకుముందు పొలంలో వేసిన ఫెన్సింగ్ రాళ్లను దొంగతనం చేసినట్టుగా కూడా కేసు నమోదై ఉంది. ఈ క్రమంలో లక్ష్మీపతి జేసీకి విన్నవించుకుని పొలానికి హద్దులు ఏర్పాటు చేసుకుని ఫెన్సింగ్ నిర్మించాడు. అయితే రాఘవేంద్ర తన అనుచరులతో కలిసి రెండురోజుల క్రితం ఫెన్సింగ్ ధ్వంసం చేయించడంతోపాటు లక్ష్మీపతిపై దాడికి దిగాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో తలచీరు రాఘవేంద్ర, అలుపూరు శ్రీనివాసులు, అలుపూరు కిరణ్, సబ్బి ప్రసాద్, తిరుపతి, వెంకటేశ్వర్లు, మాల్యాద్రి, పెంచలనర్సయ్య, మరికొందరిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితుల్లో కొందరు పరారీలో ఉండగా పోలీసులు గాలిస్తున్నారు.

వచ్చే నెల నుంచి పొగాకు బ్యారెన్ల రిజిస్ట్రేషన్లు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): పొగాకు బ్యారెన్ల రిజిస్ట్రేషన్ల రెన్యువల్ కార్యక్రమం వచ్చే నెల 6వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని డీసీపల్లి వేలం కేంద్రం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఎలాంటి అపరాధరుసుం లేకుండా అక్టోబరు 26 వరకు రిజిస్ట్రేషన్లు చేస్తామన్నారు. రూ.100 అపరాధరుసుంతో నవంబరు 9 వరకు, రూ.400తో నవంబరు 26వ తేదీ వరకు రెన్యువల్‌కు సంబంధించిన దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరిస్తామన్నారు. 2023 – 24 పంట కాలానికి సంబంధించి రైతులు తమ బ్యారెన్ల లైసెన్స్‌ల అమ్మకం లేదా కొనుగోలుకు ఈ ఏడాది పొగాకు బోర్డు అనుమతించిందన్నారు. దీంతోపాటు అనధికారికంగా తమ బ్యారెన్లను కౌలుకు తీసుకోవడాన్ని నిలిపివేశామన్నారు. బోర్డు ద్వారా అధికారికంగా మాత్రమే రైతులు బ్యారెన్లు కౌలుకు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న రాజశేఖర్

ఒక్కో రైతుకు 36.5 క్వింటాళ్లకు అనుమతి

2023 – 24 పంట కాలంలో దక్షిణ ప్రాంత తేలిక నేలల్లో 48.33 మిలియన్ కేజీలు పొగాకు పండించేందుకు మాత్రమే బోర్డు అనుమతించిందని రాజశేఖర్ తెలిపారు. ఒక్కో బ్యారెన్ రైతు 2.90 హెక్టార్లలో పంట సాగు చేసి 36.5 క్వింటాళ్లు మాత్రమే వేలం కేంద్రంలో విక్రయించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ ఏడాది అమాంతం పెరిగిన పొగాకు ధరలను చూసి అధికంగా సాగు చేయొద్దన్నారు. గతంలో కరోనా కారణంగా సాగు తగ్గిందని ఈ ఏడాది పొగాకు సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతుందన్నారు. అధిక ధరలకు బ్యారెన్లు, పొలాలు కౌలుకు తీసుకుని పండించడం మంచిదికాదని, రైతులు నష్టపోకుండా బోర్డు సూచనలు పాటించాలని తెలియజేశారు.

జొన్నవాడ ఆర్చి వద్ద మృతదేహం



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని దేవరపాళెం సమీపంలోని జొన్నవాడ ఆర్చి వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రూరల్ పోలీసులకు ఫిర్యాదు రావడంతో మృతదేహాన్ని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి వయసు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. టీ షర్ట్, షార్ట్ ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు, మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన నెల్లూరులోని దళితవాడ పూజారివీధిలో ఉన్న ఖాళీ స్థలాల్లో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. గుర్తుతెలియని (35) వ్యక్తి కొంతకాలంగా దళితవాడ సమీపంలో బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దిరోజులుగా అతని మతిస్థిమితం సరిగ్గా లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం పూజారి వీధిలోని ఖాళీ స్థలంలో మృతిచెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు వీఆర్వో స్రవంతికి సమాచారం అందించారు. ఆమె నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ బాబీ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి పోలీసులు కేసు నమోదు చేశారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.37
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.7



• సృజన

హ్యాపీ స్పేస్


• భార్గవి

యాంత్రిక ప్రయాణంలో పోటీ ఎప్పుడూ ఉండేదే! కానీ, చంటిబిడ్డ తన జీవనంలోకి వచ్చినప్పుడు అమ్మ కళ్లలో.. కలల్లో చుట్టూ జీవం ఉండాలనుకుంటుంది. 'ఆ ప్రయాస నుంచి పుట్టుకువచ్చిందే నా ప్రకృతి ఎకో ప్లే థీమ్' అంటోంది భార్గవి. హైదరాబాద్ అల్వాల్‌లో ఉంటున్న భార్గవి నేచురల్ కలర్స్ వాడకం గురించి అపార్ట్‌మెంట్ పిల్లలకు పరిచయం చేస్తూ కనిపించారు. ఆసక్తితో ఆమె చేస్తున్న పని గురించి ప్రశ్నించినప్పుడు పిల్లల కోసం తను సృష్టించిన సహజ ప్రపంచాన్ని మన ముందుంచారు..

''పుట్టింది మెదక్ జిల్లాలో. ఎమ్‌టెక్ చేసి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో బిజీ బిజీగా మారిపోయాను. పెళ్లి, పిల్లలు జీవితంలోకి వచ్చాక నాలో ఎన్నో సందేహాలు తలెత్తాయి. మూడేళ్ల నా కూతురు స్వతంత్రంగా ఎదగాలంటే ఏదైనా హ్యాపీ స్పేస్ ఉందా.. అని వెతికాను. కానీ, నాకేవీ సంతృప్తినివ్వలేదు. ప్రకృతికి ఎంత దగ్గరగా ఉంటే పిల్లల వికాసం అంత బాగుంటుంది అనే తపన నాది. దీంతో చాలారోజులు ఆలోచించాను. నా సేవింగ్స్ ఎంత ఉన్నాయో చూసుకున్నాను. చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకున్నాను. ఆరేళ్లక్రితం నా ఇద్దరు పిల్లలతో ఈ థీమ్ ప్రాజెక్టును ప్రారంభించాను. ఇప్పుడు ముప్పైమంది పిల్లలు ఉన్నారు. ఈ ముప్పై సంఖ్య దగ్గరే నేను కటాఫ్ పెట్టుకున్నాను. స్వలాభం ఏ మాత్రం చూసుకోని ఒక ప్రాజెక్ట్ ఇది. నాకై నేను నా పిల్లలకోసం సృష్టించుకున్న ప్రపంచం. ఈ పిల్లలు ఎదిగి, హైస్కూళ్లకు వెళ్లినప్పుడు ఎంత ప్రతిభను చూపిస్తున్నారో స్వయంగా తెలుసుకుంటున్నాను. ఈ హ్యాపీ స్పేస్‌లో పిల్లలు చేసే అద్భుతాలు కళ్లారా చూడాల్సిందే. అందమైన పెయింట్స్ వేస్తుంటారు. సీడ్ బాల్స్‌తయారుచేస్తారు. కాగితాలతో బొమ్మలు తయారుచేస్తారు. కూరగాయలు, పువ్వులతో రంగులు తయారుచేస్తారు. తొమ్మిదేళ్ల పాప ఫిక్షన్ స్టోరీస్ రాసి, బుక్ కూడా పబ్లిష్ చేసింది.ఆరుబయట చెట్ల కింద రాలి పడిన పూలు, విత్తనాలను ఏరుకొచ్చి, ఒక్కోదాని గురించి వివరంగా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటారు. వారికి ఇష్టమైన పండ్లు, కూరగాయలతో సలాడ్స్ చేస్తుంటారు. ప్రతీదీ నిశితంగా పరిశీలించడం వల్ల వారిలో ఎంతటి అవగాహన పెరుగుతుందో స్వయంగా చూస్తుంటాం. ఇది వారి మానసిక వికాసానికి ఎంతో మేలు కలిగిస్తుంది.

హ్యాండీ క్రాఫ్ట్ తయారీలో పిల్లల చూపే ప్రతిభ చాలా సృజనాత్మకంగా ఉంటుంది. పిల్లలను స్వతంత్రంగా ఎదగనిస్తే ఎన్ని అద్భుతాలు చూపుతారో స్వయంగా నేనే తెలుసుకుంటూ ఆశ్చర్యపోతుంటాను. రెండేళ్ల నుంచి పద్నాలుగేళ్ల పిల్లలు ఈ గ్రూప్‌లో ఉన్నారు. పిల్లలు వేసే ప్రశ్నలే ఈ ఎకో థీమ్‌లో పాఠ్యాంశాలు.



• ఎకో ప్రాజెక్ట్ వర్క్‌లో...

• నిశితంగా తెలుసుకుంటూ...

ఎవరికీ నచ్చలేదు...

మా దగ్గరకు వచ్చే పిల్లల్లో ఇప్పుడు స్పెషల్ కిడ్స్ కూడా ఉన్నారు. వారిలో ఎంత ఆర్ట్ ఉందో చూసినప్పుడు చాలా ఆశ్చర్యపోతుంటాను. చాలా మంది పేరెంట్స్ ముందు నా థీమ్‌ను ఏ మాత్రం నమ్మలేదు. 'పిల్లలకు ఈమె ఏమీ నేర్పడం లేదు. ఆడుకోవడానికి వదిలేస్తున్నారు. క్రమశిక్షణగా పిల్లలు ఒక్క దగ్గర కూర్చోవడం లేదు'ని చాలా మంది తల్లిదండ్రులు తిరిగి వెళ్లిపోయారు. కోవిడ్ టైమ్‌లో అయితే అందరూ మూసేయమనే సలహాలే. మా ఇంటి నుంచి మరీ ఎక్కువగా వచ్చాయి. 'జాబ్ మానేసి, ఇలాంటి ప్రాజెక్ట్ వద్దు, ఎలాంటి లాభాలూ ఉండవు' అనే మాటలే నా చుట్టూ విన్నాను. కానీ, లాభం కోసం ఈ థీమ్‌ని ఎంచుకోలేదు. నా పిల్లల కోసం ఎంచుకున్నాను. నేను నమ్మిన ఈ సిస్టమ్‌పై నాకు చాలా నమ్మకం ఉంది. నా ఈ థీమ్‌కు తగిన టీచర్లను ఎంపిక చేసుకోవడం కూడా కష్టంగా ఉండేది. దీంతో నేనే కొందరిని ఎంపిక చేసుకొని, నాకు తగినవిధంగా ట్రైన్ చేసుకున్నాను. అదే పట్టుదలతో కొనసాగించాను. ఫైనాన్షియల్‌గా ఇది సక్సెస్‌ఫుల్ అని చెప్పలేం. కానీ, ఎప్పటికీ నిలిచే ఉండేది, నాకు సంతృప్తిగా అనిపించిన ప్రపంచం ఇదే. దానినే పిల్లలకు పరిచయం చేయాలనుకున్నాను. నా పిల్లలనూ ఈ ప్రపంచంలో పెంచడం చాలా హ్యాపీగా ఉంది.

అవగాహన కార్యక్రమాలు...

ఈ థీమ్ వల్ల పిల్లల్లో జరిగే మానసిక వికాసం ఎంతగా ఉంటుందో తెలియజేస్తూ కార్పొరేట్ స్కూళ్లలో అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నాం. పిల్లల్లోని స్వయంప్రతిభ ఎలా ఉంటుందో, వారిని వారిలాగే ఎలా ఎదగనివ్వాలో మా నేచర్ పిల్లలను పరిచయం చేసి, మరీ చూపుతుంటాను. రోజువారీ మనకు ఏం అవసరమో వాటన్నింటినీ స్వయంగా ఇక్కడి పిల్లలు చేస్తుంటారు. వాళ్లే వంట చేయడం, తినడం.. ఏదీ కూడా చెప్పకుండానే ఒకరిని చూసి ఒకరు నేర్చుకుంటూ, తమ ప్రతిభను చూపుతుంటారు. లాభాపేక్ష లేకుండా చేసే ఈ పని రాబోయే తరాలకు ప్రయోజనం కలిగించడమే నాకు వచ్చే ఆదాయం' అని చెబుతోంది భార్గవి.

– నిర్మలారెడ్డి
ఫొటో: మోహనాచారి

న్యాయమైన సూచన

తండ్రికీ కావాలి ప్రసూతి సెలవు



తల్లికి ప్రసూతి సెలవు ఇస్తున్నట్టే తండ్రికి కూడా ప్రసూతి సెలవు ఇవ్వడం గురించి ఆలోచించే సమయం వచ్చేసిందని మద్రాసు హైకోర్టు వ్యాఖ్యానించింది. భార్య ప్రసవ సమయంలో బాలింతను, నవజాత శిశువును చూసుకోవడానికి తండ్రికి సెలవు ఇవ్వకతప్పదని, ఈ మేరకు దేశంలోని అన్ని రాష్ట్రాలు శాసనపరమైన చట్టాలు తేవాలని జస్టిస్ విక్టోరియా గౌరి సూచించారు. నిజమే. తండ్రికి సెలవు భార్యభర్తల మధ్య అనేక చికాకులను దూరం చేయగలదు. ఒక పరిశీలన.

బిడ్డకు జన్మనివ్వడమంటే సమాజానికి కొత్త సభ్యుణ్ణి ఇవ్వడమే. పుట్టిన బిడ్డ తల్లిదండ్రులకు సంతానం కావచ్చు కాని సమాజానికి ప్రతినిధే. బిడ్డకు సురక్షితంగా జన్మనివ్వడంలో తల్లిదండ్రుల బాధ్యత ఎంతో, ఆ తల్లిదండ్రులకు తగిన సౌకర్యాలు కల్పించడంలో సమాజానిదీ అంతే బాధ్యత. కనేందుకు ఆస్పత్రి, పెంచేందుకు తండ్రికి కనీస ఆదాయం లేకపోతే సమాజం తప్పవుతుంది. గతంలో స్త్రీ ఇంటి పట్టునే ఉండేది. ఉమ్మడి సంసారాల్లో కాన్పులకు సులువుగా సాయం దొరికేది. కాని ఇప్పుడు ఇలా తాళి కడితే అలా విడిగా కాపురం పెట్టే పరిస్థితులు వచ్చాయి. దానివల్ల పిల్లల్ని కనడం, పెంచడం చాలా పెద్ద బాధ్యతగా మారింది తల్లిదండ్రులకు. ఉద్యోగం చేసే స్త్రీలకు ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ప్రసూతి సెలవులు మంజూరు అవుతున్నా ఆ స్త్రీలకు, పుట్టిన శిశువులకు కాన్పు సమయంలో తోడుగా ఉండాల్సిన పురుషులకు మాత్రం సెలవు గురించి ఇంకా ఆలోచన రావడం లేదు. సమాజం ఇంకా అంత'నాగరికం'గా ఆలోచించడం లేదు. కాని తాజా ఘటన ఈ అంశాన్ని చర్చకు తెచ్చింది.

సమయం వచ్చేసింది

మద్రాసు హైకోర్టులో ఈ కేసును విన్న జస్టిస్ ఎల్.విక్టోరియా మేరి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో మగవారికి ప్రసూతి సెలవులు తప్పనిసరి చేస్తూ చట్టాలు తేవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సమస్యకు స్పందించాల్సిన సమయం వచ్చేసిందని అన్నారు. 'పిల్లల్ని కని, పెంచడంలో స్త్రీ, పురుషులిరువురికీ సమాన బాధ్యత ఉంటుంది. ప్రపంచంలోని అనేక దేశాలు ప్రసూతి సమయంలో తల్లితో పాటు తండ్రికీ సెలవులు ఇస్తున్నాయి. అవి ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రమాణాలకు సరితూగకపోయినా ఏదో ఒక మేరకు ఇస్తున్నాయి. మన దేశంలో సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ (1972) ప్రకారం భార్య ప్రసూతి సమయంలో పురుషులకు లీవ్ పెట్టే వీలు ఉంది. కాని ఆ రూల్స్ చాలా రాష్ట్రాల్లో అమలు కావడం లేదు'.



-జస్టిస్ విక్టోరియా గౌరి, మద్రాసు హైకోర్టు

కోర్టుకెక్కిన తండ్రి

తమిళనాడులోని తెన్‌కాశీలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న బి.శరవణన్ తన భార్యకు కాన్పు సమయంలో తోడు ఉండేందుకు 90 రోజుల సెలవు అడిగాడు. దానికి కారణం అతని భార్య ఐ.వి.ఎఫ్. ద్వారా గర్భం దాల్చడమే. ఐ.వి.ఎఫ్.ద్వారా గర్భం దాల్చితే కాన్పు అయ్యేంత వరకూ జాగ్రత్తగా ఉండాలి. అందుకే సెలవు అడిగాడు. పరిస్థితి విన్న అధికారులు శాంక్షన్ చేశారు. కాని ఆ సెలవు ఉపయోగంలోకి రాక ముందే అతను విధుల్లో లేకపోతే లా అండ్ ఆర్డర్ సమస్యలు వస్తాయని సెలవు కేన్సిల్ చేశారు. దాంతో శరవణన్ కోర్టుకు వెళ్లాడు. డెలివరీ డేట్ మే 30 కనుక కోర్టు మే 1 నుంచి సెలవు ఇమ్మంది. అధికారులు 30 రోజులు సెలవు మంజూరు చేశారు. కాని డెలివరీ మే 31న జరిగింది. దాంతో మే 31న శరవణన్ విధులకు హాజరు కాలేకపోయాడు. అంతే కాదు సెలవు పొడగింపును కోరాడు. అధికారులు సెలవును పొడిగించకపోగా చెప్పాపెట్టకుండా విధులకు హాజరుకానందున ఎందుకు చర్య తీసుకోకూడదో జూన్ 22న వచ్చి వ్యక్తిగతంగా సంజాయిషీ ఇమ్మని ఆదేశించారు. ఆ ఆదేశాలను శరవణన్ హైకోర్టులో సవాలు చేశాడు. కోర్టు ఆ ఆదేశాలను కొట్టేస్తూ మగవారికి కూడా ప్రసూతి సెలవులు అవసరమని అభిప్రాయపడింది.

ఆందోళన లేకుండా

కాన్పు సమయంలో భార్యకు ఎంత ఆందోళన ఉంటుందో భర్తకూ అంతే ఆందోళన ఉంటుంది. రెండు ప్రాణాలు పరీక్ష సమయాన్ని ఎదుర్కొనే వేళ సహజంగానే లేబర్ రూమ్ బయట పురుషుడు ఒత్తిడికి లోనవుతాడు. అదొక్కటే కాదు బిడ్డ పుట్టాక భార్యకు శక్తి వచ్చే వరకు, బిడ్డ కుదుట పడేవరకు ఇంట్లో పనులు ఎన్నో ఉంటాయి. ఆస్పత్రుల చుట్టూ తిరుగుళ్లు ఉంటాయి. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇంటి నుంచి ఫోన్ రాగానే కంగారు పడుతూ భర్తలు ఆ సమయంలో వేదన అనుభవిస్తారు. మరోవైపు తోడుండాల్సిన భర్త ఇంటి పట్టున లేకపోతే, డబ్బు సంపాదన ఎంత తప్పనిసరి అయినప్పటికీ, భార్యకు నిస్పృహ రావడం సహజం. రాత్రిళ్లు చంటి పిల్లల ఏడ్పు వల్ల ఉదయాన్నే ఉద్యోగానికి వెళ్లాల్సిన భర్త నిద్ర చెడి చిరాకు పడితే ఆ గొడవ కాస్తా విడాకుల వరకు వెళ్లిన కేసులెన్నో. అందు వల్ల భార్యతో పాటు భర్తకు సెలవులు ఇవ్వడం ఎంతో అవసరం. 'కనేది ఆమె అయితే ఇతనికేం నొప్పి' అని హేళన చేసే రోజులు పోయాయి. ఈ బిజీ రోజుల్లో మనిషి తోడు కష్టమైన రోజుల్లో భర్తకు భార్య, భార్యకు భర్త ఒకరికొకరై సంతానాన్ని సాకాలంటే ఇలాంటి నాగరికమైన ఆలోచనలు తప్పక చేయాల్సిందే.

పర్యావరణ పరిరక్షణ గురించి మాటలు కాదు, చేతల్లో చూపించండి అని గ్రేటాథన్ బర్గ్ గళం విప్పింది. ఈ మాటను తూ.చ. తప్పకుండా ఆచరిస్తూ.. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది మాన్యా. అందుకే మాన్యను' అంతర్జాతీయ యూత్ ఇకో– హీరో' అవార్డు వరించింది.

అసామాన్యం


• మాన్య





పర్యావరణ సమస్యలను పరిష్కరించే ఎనిమిది నుంచి పదహారేళ్లలోపు వయసు వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ప్రపంచవ్యాప్తంగా పదిహేడు మంది యువతీ యువకులను ఈ అవార్డుకు ఎంపిక చేయగా మన దేశం నుంచి మాన్యహర్షను ఏరికోరి ఈ అవార్డు వరించింది. మాన్య చేపట్టిన 'సన్‌షైన్'ప్రాజెక్టుకు గానూ ఇంతటి గుర్తింపు లభించింది. 27 దేశాలు, 32 అమెరికా రాష్ట్రాల్లో... ఇరవై ఏళ్లుగా పర్యావరణం గురించి కృషిచేస్తోన్న... 339 మందిని గుర్తించి వారిలో పదిహేడు మందికి ఇకో హీరో అవార్డులు ఇచ్చారు.

బెంగళూరుకు చెందిన పదిహేడేళ్ళ మాన్య గోల్డెన్ బీ ఆఫ్ విబ్జిఆర్ హైస్కూల్లో చదువుతోంది. చిన్నప్పటి నుంచి మొక్కలంటే ఇష్టం. మాన్యకు నాలుగేళ్లు ఉన్నప్పుడు నానమ్మ రుద్రమ్మ మాన్యతో మొక్కను నాటిస్తూ... ''ప్రకృతినీ, పర్యావరణాన్నీ ప్రేమగా చూసుకోవాలి. మనతోపాటు మొక్కలు, జంతువులను బతకనిస్తే మనం బావుంటాము'' అని ఆమె మాన్యకు చెప్పింది. అప్పటి నుంచి మాన్యకు పర్యావరణంపై మక్కువ ఏర్పడింది. చిన్నప్పటి నుంచి పర్యావరణ కార్యక్రమాల్లో పాల్గొనేది.

లాక్‌డౌన్ సమయంలో...

కరోనా వైరస్ చెడు చేసినప్పటికీ సరికొత్త పనులు చేయడానికి కొంత మందికి వెసులుబాటు కల్పించింది. ఈ వెసులుబాటును వాడుకున్న మాన్య.. పిల్లల కోసం 'సన్ షైన్' అనే మ్యాగజైన్‌ను ప్రారంభించింది. ప్రింట్, డిజిటల్ కాపీల ద్వారా పర్యావరణ పరిరక్షణ గురించి పిల్లలకు అవగాహన కల్పిస్తోంది. ఈ మ్యాగజైన్‌ను బెంగళూరులోని మాంటిస్సోరి, ఇతర స్కూళ్లలోని పిల్లలకు ఉచితంగా అందిస్తోంది. వివిధ కార్యక్రమాలను పరిచయం చేస్తూ పర్యావరణ ప్రాధాన్యత గురించి వివరిస్తోంది. 'ఈచ్ వన్ ప్లాంట్ వన్ క్యాంపెయిన్', 'పేపర్ మేకింగ్ వర్క్‌షాప్', 'పిల్లలు నీటిని ఎలా కాపాడగలరు?','న్యూ ఇండియా సస్టెయినబుల్ క్యాంపెయిన్','ప్లాస్టిక్ ఫ్రీ జూలై రైటింగ్ కాంపిటీషన్', ఎర్త్‌డే రోజు పెయింటింగ్ పోటీల వంటివాటిని మ్యాగజైన్ ద్వారా నిర్వహిస్తూ పర్యావరణంపై చక్కని అవగాహన కల్పిస్తోంది. తన యూట్యూబ్ ఛానెల్లో కూడా పర్యావరణ కార్యక్రమ వీడియోలు షేర్ చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

పీల్స్‌తో పేపర్స్..


అనేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు వంటింట్లో మిగిలిపోయే కూరగాయ తడి వ్యర్థాలను ప్యాకింగ్ పేపర్స్‌గా మారుస్తోంది. కూరగాయ తొక్కలను ఉపయోగించి, పెన్సిల్స్, పేపర్‌లు రూపొందిస్తోంది. ఇప్పటి దాకా రెండు వందలకు పైగా వెజిటేబుల్ పీల్ పేపర్లను తయారు చేసింది. ఇందుకోసం వంటింట్లో మిగిలిపోయిన వ్యర్థాలు, పండుగల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను సేకరించి, వాటిని గ్రైండ్ చేసి పేపర్‌గా మార్చడం విశేషం. పాత జీన్స్ ప్యాంట్లను డెనిమ్ పేపర్‌లుగా తీర్చిదిద్దుతోంది. మాన్యా స్వయంగా తయారు చేయడమే గాక, వర్క్‌షాపుల ద్వారా పేపర్‌ల తయారీ గురించి పిల్లలకు నేర్పిస్తోంది.

అనేక అవార్డులు..

నాలుగున్నరవేలకు పైగా మొక్కలను నాటి, ఏడువేల మొక్కలు పంపిణీ చేసింది. ఐదువేల విత్తనాలను నాటింది. ఎనిమిదివేలకు పైగా ఆర్గానిక్, కాటన్ సంచులను పంచింది. సిటీ, హైవే రోడ్లు, నీటి కుంటలను శుద్ధిచేసే కార్యక్రమాలను చేపట్టింది. వీటన్నింటికి గుర్తింపుగా మాన్యకు అనేక అవార్డులు వచ్చాయి. వెజిటేబుల్ పేపర్‌కు గ్రీన్ ఇన్నోవేటర్, జల వనరుల మంత్రిత్వ శాఖ 2020 సంవత్సరానికి గాను 'వాటర్ హీరో', ఎర్త్‌డాట్ ఓ ఆర్జీ ఇండియా నెట్‌వర్క్ నుంచి రైజింగ్ స్టార్, హ్యూమానిటేరియన్ ఎక్సలెన్స్ అవార్డులు వచ్చాయి. పృథ్వీ మేళా, అక్షయ్‌కల్ప్ రీసైక్లింగ్ మేళా, లయన్స్ క్లబ్, బ్యాక్ టు స్కూల్ ప్రోగ్రామ్, బైజూస్ పేపర్ బ్యాగ్ డే వంటి కార్యక్రమాల్లో పర్యావరణంపై ప్రసంగించింది. ఇవన్నీగాక మాన్య ప్రకృతిమీద ఏడు పుస్తకాలు రాసింది. 2019 ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ యంగెస్ట్ పోయెట్, ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గ్రాండ్ మాస్టర్ టైటిల్ గెలుచుకుంది.

''ఈ అవార్డు నా కృషిని గుర్తించి మరింత స్ఫూర్తిని ఇచ్చింది. భవిష్యత్‌లో నా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకువెళ్తాను'' అని చెబుతూ ఎంతోమందిని ఆలోచించేలా చేస్తోంది మాన్య.

ఏ క్యారెక్టర్‌తోనైనా... చాట్ చేయొచ్చు



సాపేక్ష సిద్ధాంతం గురించి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో సంభాషించింది సృజన. సినిమాలు ఎక్కువగా చూసే గీతిక దర్శక దిగ్గజం ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్‌తో 'నంబర్ 13' నుంచి 'ది వైట్ షాడో' వరకు ఎన్నో సినిమాల గురించి వివరంగా సంభాషించింది. ఇక స్వరతేజకు జపనీస్ ప్రఖ్యాత వీడియో గేమ్ క్యారెక్టర్ 'మారియో'తో సంభాషించడం సరదా! కాల్పనికత అనేది మనకు బొత్తిగా కొత్త కాదు. అయితే ఏఐ సాంకేతికత కాల్పనికతను మరోస్థాయికి తీసుకువెళ్లింది. యువతరం తాజా ఆర్టిఫిషియల్ క్రేజ్ 'క్యారెక్టర్.ఏఐ' ఆ సాంకేతికతలో భాగమే...

యూత్ పల్స్

ఏఐ పవర్ హౌజ్ 'ఓపెన్ ఏఐ' అంతర్జాల సంచలనంగా మారింది. 'చాట్ జీపీటీ' పాపులారిటీతో ఎన్నో టెక్నాలజీ కంపెనీలు తమ సొంత ఏఐ చాట్ బాట్‌లను ప్రవేశపెట్టాయి. 'చాట్‌జీపీటీ' పాపులారిటీ సంగతి ఎలా ఉన్నా యువతరం తాజా ఆసక్తులలో 'క్యారెక్టర్. ఏఐ' ఒకటిగా మారింది.

'క్యారెక్టర్. ఏఐ' ద్వారా సెలబ్రిటీలు, చారిత్రక వ్యక్తులు, కాల్పనిక పాత్రలు, పాపులర్ వీడియో గేమ్ క్యారెక్టర్‌లు, థెరపిస్ట్‌లతో హాయిగా సంభాషించవచ్చు. సంభాషణల విషయంలో ఇది 'చాట్ జీపీటీ' కంటే సహజంగా ఉంటుందనే టాక్ వినిపిస్తోంది.

నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, మెషిన్ లెర్నింగ్ కాంబినేషన్‌లో 'క్యారెక్టర్. ఏఐ'ను అభివృద్ధి చేశారు. 'క్యారెక్టర్.ఏఐ'లో ఎకౌంట్ సెటప్ పూర్తి చేసిన తరువాత 'క్రియేట్ ఏ క్యారెక్టర్' ఆప్షన్‌ను క్లిక్‌చేస్తే విండో ఓపెన్ అవుతుంది. క్యారెక్టర్ తనకు తాను పరిచయం చేసుకుంటుంది. ఆ తరువాత సంభాషణ మొదలుపెట్టవచ్చు.

ఉదాహరణకు...'హారీ పోటర్' సిరీస్ లోని ఫిక్షనల్ క్యారెక్టర్ హమైనీ గ్రేంజర్‌తో సంభాషించాలనుకున్నాం.

'హలో రమ్య, మై నేమ్ ఈజ్ హమైనీ గ్రేంజర్. ఇట్స్ వెరీ నైస్ టు మీట్ యూ' అంటూ తనను తాను పరిచయం చేసుకుంటుంది హమైనీ. తన ఇష్టాయిష్టాలు, ఆసక్తుల గురించి చెబుతుంది.

రిలవెంట్ ట్యాగ్స్ అందుబాటులో ఉంటాయి. క్యారెక్టర్ వ్యక్తిత్వం ఆధారంగా డ్రాప్ డౌన్ మెన్యూ నుంచి స్పీకింగ్ వాయిస్‌ను సెలెక్ట్ చేసుకోవచ్చు.

ఒక క్యారెక్టర్‌తో చాట్ చేయవచ్చు లేదా మల్టిపుల్ క్యారెక్టర్స్‌తో గ్రూప్ చాట్ చేయవచ్చు.

'క్యారెక్టర్. ఏఐ' అనేది టెక్స్‌కు మాత్రమే పరిమితం కాదు. ప్రాంప్ట్స్, చాట్స్ ఆధారంగా ఇమేజ్‌లను క్రియేట్ చేయవచ్చు.

ఏఐ ఇండస్ట్రీ ప్రముఖులుగా గుర్తింపు పొందిన షాజీర్, డేనియల్ ఫ్రెటస్ గూగుల్‌లో పనిచేస్తున్నప్పుడు 'క్యారెక్టర్. ఏఐ'కు సంబంధించి ఆలోచన చేశారు. షాజీర్ 'అటెన్షన్ ఈజ్ ఆల్ యూ నీడ్' పుస్తక రచయితలలో ఒకరు. ఇక డేనియల్ 'మీన' అనే చాట్‌బాట్ క్రియేటర్.

వ్యక్తిగత వస్తువులు ఉన్నట్లే, పర్సనలైజ్‌డ్ చాట్ బాట్‌లు ఉండాలనుకునేవారికి క్యారెక్టర్ ఏఐ ఉపయోగపడుతుంది. 'వర్చువల్ ఫ్రెండ్'ను సృష్టిస్తుంది.

'పర్సనలైజ్‌డ్ చాట్‌బాట్ అంటే మాటలా? ఖర్చు బాగానే అవుతుంది కదా' అనే సందేహం వస్తుంది. అయితే 'క్యారెక్టర్. ఏఐ'తో ఖర్చు లేకుండానే సొంత చాట్‌బాట్‌ను సృష్టించుకోవచ్చు.

ఆ.. ఏముంది... అంతా కాల్పనికమే కదా అనుకుంటే ఏమీ లేకపోవచ్చు. ఉంది అనుకుంటే మాత్రం ఎంతో ఉంది.

'కొత్త అనుభూతిని సొంతం చేసుకున్నామా లేదా అనేది ముఖ్యం కాని వాస్తవమా కాదా అనేది ముఖ్యం కాదు' అంటున్నాడు 'యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా' కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం అసోసియేట్ ప్రొఫెసర్ మైక్.

'చాట్ జీపీటీ' గురించి ఎంత గొప్పగా చర్చించుకున్నప్పటికీ కొన్ని ప్రయోగాలు దెబ్బతిన్నాయి. ఉదాహరణకు ... నేషనల్ ఈటింగ్ డిజార్డర్స్ అసోసియేషన్ బరువు తగ్గడానికి సంబంధించి సమస్యాత్మక సలహా ఇచ్చినందుకు తమ చాట్‌బాట్‌ను సస్పెండ్ చేసింది. క్యారెక్టర్.ఏఐ విషయంలోనూ పొరపాట్లు జరగవచ్చు. సాంకేతికతకు పరిమితులు ఉండే విషయాన్ని అర్థం చేసుకోవాలి' అంటుంది చెన్నైకి చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ మనీష.



రియల్ చాలెంజర్... జెమిని

ఏఐ రేసులో ఓపెన్ ఏఐ లాంగ్వేజ్ మోడల్స్ లీడింగ్‌లో ఉన్నప్పటికీ ఇది ఎప్పటివరకు అనేది ప్రశ్నార్థకంగా ఉంది. దీనికి కారణం సరికొత్తగా వస్తున్న పవర్‌ఫుల్ ఏఐ మోడల్స్. వీటిమాట ఎలా ఉన్నా గూగుల్ వారి 'జెమిని'ని అసలు సిసలు రియల్ చాలెంజర్ అంటున్నారు. గూగుల్ తమ కొత్త 'జెమిని' ప్రాజెక్ట్‌లో భాగంగా నెక్స్ట్ – జనరేషన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్‌ను లాంచ్ చేయనుంది.

'జెమిని' అనేది కన్వర్‌సేషనల్ టెక్స్ట్‌ను జనరేట్ చేయడానికి పరిమితం కాదు. ఇన్‌పుట్స్, వీడియోలు, ఇమేజ్ లను హ్యాండిల్ చేసే మల్టీ–మోడల్ జెమిని. గూగుల్ దగ్గర ఉన్న అపారమైన వనరులు(యాక్సెస్ టు యూ ట్యూబ్ వీడియోస్, గూగుల్ బుక్స్, సెర్చ్ ఇండెక్స్, స్కాలర్ మెటీరియల్)లతో 'జెమిని' ఇతర కంపెనీలకు గట్టి ప్రత్యర్థిగా మారనుంది. 'ఎక్స్‌క్లూజివ్ టు గూగుల్' అనే ప్రత్యేకత వల్ల జెమిని మరింత బలంగా మారనుంది.

